క్లుప్తంగా

పరామర్శ



డాక్టర్ మహేంద్రరెడ్డిని పరామర్శిస్తున్న సంజీవయ్య, సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: మండలంలోని జీలపాటూరుకు చెందిన వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పాలూరు మహేంద్రరెడ్డి తల్లి సుదర్శనమ్మ(77) బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి గ్రామానికి చేరుకున్నారు. సుదర్శనమ్మ భౌతికదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహేంద్రరెడ్డిని ఓదార్చారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దాల సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ ప్రిస్కిల్లా, నాయకులు మనోహర్‌రెడ్డి, తిరుపాలయ్య, సుబ్బరాఘవయ్య, పాండు, రవి, రాఘవయ్య, గోపాలయ్య పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

సైదాపురం: రైతులు పంటలు సాగు చేసే ముందు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి హైమావతి కోరారు. మండలంలోని చీకవోలులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు వాడితే మంచి దిగుబడులు వస్తాయన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందజేస్తున్నట్టు వివరించారు. ఉద్యాన శాఖాధికారి ఆనంద్ పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎన్‌బీకేఆర్ విద్యార్థులు



కోట: దక్షిణ ప్రాంత అంతర రాష్ట్ర విశ్వవిద్యాలయాల టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలకు ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల పీడీ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 18 నుంచి తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఇంజినీరింగ్‌లో జేఎన్‌టీయూఏ ఆధ్వర్యంలో నిర్వహించిన సెలక్షన్స్‌లో తమ విద్యార్థులు కే.వంశీధర్‌రెడ్డి, ఏ.చందు, ఎస్.చందన ఎంపికైనట్టు తెలిపారు. వారిని కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి అభినందించారు.

గ్రామ సభల్లో సమస్యల పరిష్కారం

చిల్లకూరు: సర్వేలో పొరపాట్లు జరిగి ఉంటే గ్రామసభల్లో సరిచేసుకోవచ్చని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని అద్దేపల్లిలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. రీ సర్వే సమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గతంలో సర్వే చేసేటప్పుడు హద్దులు, పేర్లు, విస్తీర్ణంలో మార్పులు ఉంటే వాటిని సరిచేసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. సర్వేయర్ మల్లికార్జున్, ఆర్ఐ పూర్ణ, వీఆర్వో రామచంద్రయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల నిరసన

సూళ్లూరుపేట: సూళ్లూరుపేటకు చెందిన సీనియర్ న్యాయవాది కె.ధర్మాప్రసాద్‌పై ఎస్ఐ బ్రహ్మనాయుడు దురుసుగా ప్రవర్తించడంపై న్యాయవాదులు బుధవారం కూడా నిరసన తెలిపారు. వారు కోర్టు విధులను బహిష్కరించారు. ఎస్ఐకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటుచేశారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ సివిల్ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకోకూడదన్నారు. ఎస్ఐ సివిల్ వివాదంలో జోక్యం చేసుకోవడంతోపాటు సీనియర్ న్యాయవాదిపై దురుసుగా ప్రవర్తించాడన్నారు. ఈ విషయాన్ని రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్లకు తెలియజేస్తామని తెలిపారు.

తూతూమంత్రంగా విచారణ

చిట్టమూరు(చిల్లకూరు): చిట్టమూరు మండలం ఆరూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు- నేడు కింద చేసిన పనులపై బుధవారం డీవైఈవో శాంతి తూతూమంత్రంగా విచారణ చేసినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. నేడు అధికార పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న ఒక నాయకుడు అప్పట్లో నాడు- నేడు పనులను నాశిరకంగా చేశారని, హెచ్ఎంగా జ్యోతి హయాంలో పదో తరగతి ఫలితాలు అధ్వానంగా వస్తున్నాయని స్థానికులు రెండు రోజుల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టాలని డీవైఈవో శాంతిని ఆదేశించారు. ఆమె బుధవారం విచారణ చేశారు. హెచ్ఎం కుటుంబ సభ్యులు మంత్రికి కావాల్సిన వారు కావడంతో విచారణ అధికారులపై ఒత్తిడి చేయించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై డీవైఈవో శాంతిని ఫోన్ ద్వారా వివరణ కోరగా 'విచారించాం. కలెక్టర్‌కు నివేదిక ఇస్తాం. ఈ విషయాలు మీకు ఎందుకు చెప్పాలి' అంటూ సమాధానం ఇచ్చారు.

ఉచిత డీఎస్సీ శిక్షణ

గూడూరు రూరల్: డీఎస్సీకి సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు గూడూరు డివిజన్ సహాయ సాంఘిక సంక్షేమశాఖ అధికారి మనోజ్ తెలిపారు. అర్హత ఉన్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, 50–50 పద్ధతి కింద ఎంపిక చేసి రెసిడెన్షియల్ విధానంలో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు.

మత్స్యకార భరోసా ఎన్నడో..?

సముద్రంలో చేపల వేటే వారికి జీవనాధారం. ప్రతి ఏటా మే నుంచి జూలై వరకు చేపల సంతానోత్పత్తి సమయంలో చేపల వేటకు నిషేధం. దీనికితోడు వరుస తుపానులతో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. పడవలు ఒక చోట నిలవడం లేదు. చేపల వేట లేక మత్స్యకారులు కుటుంబ పోషణ కష్టంగా మారింది. గతంలో వారికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏడాదికి రూ.10 వేల చొప్పున మత్స్యకార భరోసా నిధులు విడుదల చేసేది. 2024 ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు చెప్పారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా దాని ఊసే ఎత్తలేదు. సాయం ఎప్పుడు చేస్తారోనని మత్స్యకారులు ఎదురుచూస్తూ ఉన్నారు.



వేట నిషేధ సమయంలో పులికాట్ సరస్సు ఒడ్డున నిలిపి ఉన్న బోట్లు(ఫైల్)

- రూ.20 వేలు ఇస్తామన్న చంద్రబాబు
- చేపల వేటలేక ఇబ్బంది పడుతున్న మత్స్యకారులు
- సాయం కోసం ఎదురు చూపులు

తడ: మండలంలో 17 జాలర్ల కుప్పాలు ఉన్నాయి. సుమారు 8 వేల మందికి పైగా మత్స్యకారులు ఉన్నారు. అదేవిధంగా కోటలో 400, చిల్లకూరులో 1600, వాకాడులో 1200 మంది ఉన్నారు. వారు మెకనైజ్డ్ బోట్లలో సముద్రంలోకి వెళ్లి వారం రోజులు అక్కడే ఉండి చేపలు పట్టుకుని వస్తారు. ఒక్కోసారి టన్ను నుంచి మూడు టన్నుల వరకు చేపలు దొరుకుతాయి. వాటిని విక్రయించడం ద్వారా వచ్చిన ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటూ ఉంటారు. ప్రతిఏటా మే నెల నుంచి జూలై వరకు చేపల వేటకు నిషేధం అమలులో ఉంటుంది. ఆ సమయంలో వారు జీవనానికి ఇబ్బంది పడకుండా గతంలో ప్రభుత్వాలు రూ.4 వేల భృతిని మంజూరు చేసేవి. ప్రజా సంకల్పయాత్రలో వారి కష్టాలను చూసిన వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకార భరోసా పథకాన్ని అమలుచేసి రూ.10 వేలను వారి ఖాతాల్లో జమ చేశారు. పారదర్శకంగా అర్హులను ఎంపిక చేసి ప్రతి ఏటా క్రమంతప్పకుండా నిధులను మంజూరు చేశారు. ఇలా తడ మండలంలో 17 జాలర్ల కుప్పాలకు చెందిన 1,613 మంది, కోటలో 176 మంది, చిల్లకూరులో 813 మంది, వాకాడులో 1,045 మందికి భరోసా మంజూరు చేశారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబు మత్స్యకార భరోసాను రూ.20 వేలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. దీన్ని నమ్మిన మత్స్యకారులు చంద్రబాబును నమ్మి ఓట్లు వేశారు. ఆయన అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా ఆర్థిక సాయం గురించి ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు. దీంతో తాము మళ్లీ మోసపోయామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేపల వేట లేక ఇబ్బందులు పడుతున్నాం



మూడు నెలలు చేపల వేట లేక ఎంతో ఇబ్బంది పడ్డాం. గతంలో నిత్యావసరాలు ఇచ్చేవారు. తర్వాత రూ.4 వేల భృతి ఇస్తూ వచ్చారు. దాన్ని వైఎస్.జగన్ రూ.10 వేలకు పెంచారు. అవన్నీ సకాలంలో రావడంతో వేట లేని సమయంలో జీవనానికి ఇబ్బంది ఉండేది కాదు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు ఎలాంటి సాయం అందించలేదు. ప్రభుత్వ పెద్దలు స్పందించి రూ.20 వేలు వెంటనే ఇస్తే బాగుంటుంది.

–బి.వినాయకం, తడకుప్పం

జీవనం అంతంతమాత్రంగానే ఉంది



చేపల సక్రమంగా దొరక్క జీవనం అంతంత మాత్రంగానే ఉంది. దీనికి తోడు మూడు నెలలు పని లేకుండా ఉంటే కుటుంబం మొత్తం పస్తులు ఉండాల్సిన పరిస్థితి. గతంలో ప్రభుత్వం జాలర్ల బాధలను గుర్తించి రూ.10 వేల సాయం చేసింది. ఈ ఏడాది ఎన్నికల్లో భృతిని రూ.20 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు దాని గురించి పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రూ.20 వేల భృతిని వెంటనే ఇవ్వాలి.

–జె.దేశప్పన్, ఇరకం

మరోసారి మోసం చేసిన బాబు



గతంలో వేట పుష్కలంగా సాగేది. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. వేటలో పెద్దగా ఫలితం కనిపించడం లేదు. వేరే పనులు చేసుకుందామంటే చేపల వేట తప్ప మరొక పని రాదు. మూడు నెలలపాటు కుటుంబాన్ని ఇబ్బంది కరంగా నెట్టుకొచ్చాం. తుపానులతో చేపల వేట సాగడం లేదు. రూ.20 వేలు ఇస్తామన్న చంద్రబాబు మాటలు నమ్మి మరోసారి మోసపోయాం. ఇప్పటికైనా చంద్రబాబు సాయం చేయాలి.

–పి.పార్థిపన్, ఇరకం



విద్యానగర్‌లో విషాదఛాయలు

కోట: మనుబోలు మండలం బద్దెవోలు క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్దారెడ్డి వెంకటరమణారెడ్డి(60), పానకా వెంకటసుబ్బారెడ్డి(64) మృతి చెందడంతో విద్యానగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. వారు కారు కొనుగోలు కోసం మోటార్ బైక్‌లో నెల్లూరు వెళ్లి తిరిగి వస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మృతి చెందారు. మృతదేహాలకు గూడూరు ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం బుధవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారికి బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పలువురు నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గాయపడిన వ్యక్తికి పేర్నాటి పరామర్శ

చిల్లకూరు: కోట మండలం ఉత్తమ నెల్లూరులో ఇటీవల జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడి గూడూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈదూరు ప్రసాద్‌ను బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. గొడవకు గల కారణాన్ని అడిగి తెలుసుకున్నారు. గతంలో గ్రామ చెరువులో మట్టి తవ్వకాలను అడ్డుకున్నామని, దీన్ని మనసులో ఉంచుకుని తిరునాళ్ల సందర్భంగా దాడి చేసి గాయపరిచారని ప్రసాద్ తెలిపారు. పేర్నాటి మాట్లాడుతూ ఏదైనా అవసరమైతే సమాచారం ఇవ్వాలని, సాయం చేస్తామన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోట మండలం విద్యానగర్ ప్రాంతానికి చెందిన వెంకటరమణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఊనుగుంటపాళెం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తూపిలి రాధాక్రిష్టారెడ్డి, దువ్వూరు శ్రీనివాసులురెడ్డి, కిషోర్‌రెడ్డి, చిల్లకూరు వెంకురెడ్డి, శ్రీధర్, రఘురామిరెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.



ప్రసాద్‌ను పరామర్శిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

అన్నా క్యాంటీన్ ప్రారంభం

వెంకటగిరి రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమీపంలో రూ.16.86 లక్షలతో పునరుద్ధరించిన అన్నా క్యాంటీన్‌ను బుధవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రారంభించారు. పేదలకు భోజనం వడ్డించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్నా క్యాంటీన్‌లో గ్రామాల నుంచి పలు పనుల నిమిత్తం వెంకటగిరికి వచ్చే పేదలకు రూ.5లకే నాణ్యమైన భోజనం అందజేస్తామన్నారు. జిల్లాలోని 7 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లతో కలిసి 11 అన్నా క్యాంటీన్లను ప్రారంభించినట్టు వివరించారు. మధ్యాహ్నం 450 మందికి, రాత్రి 400 మందికి భోజన సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ రాపూరు మండలంలో కూడా అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో కోటేశ్వరరావు పాల్గొన్నారు.



పేదలకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

రోడ్లను బాగు చేయాలని నిరసన

గూడూరు రూరల్: గూడూరు పట్టణం, రూరల్ ప్రాంతాల్లోని రోడ్లను బాగు చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు బుధవారం మినీ బైపాస్ వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గూడూరు రెండవ పట్టణ ప్రాంతం నుంచి చెన్నూరు, తిప్పవరపాడు వరకు అడుగుకో గుంత పడిందన్నారు. వాటిలో అప్పడప్పుడూ మట్టిపోస్తున్నారని, వర్షం కురిసినప్పుడు బురదలో వాహనాలు ఇరుక్కుపోతున్నాయని తెలిపారు. అనంతరం బురదలో ఇరుక్కుపోయిన ట్రాక్టర్‌ను బయటకు లాగారు. తర్వాత ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు వినత్రి పత్రం అందజేశారు.

గిరిజనులకు పట్టాలు ఇవ్వాలి

దొరవారిసత్రం: మండలంలోని తనియాలి ఎస్టీ కాలనీకి చెందిన గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు కోరారు. వారు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ శైలకుమారికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తనియాలి ఎస్టీ కాలనీలో 50 కుటుంబల వారు సర్వే నంబరు 1లో 40 ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం సీజేఎఫ్ఎస్ సొసైటీని రద్దు చేసి డీకేటీ పట్టాలు ఇచ్చిందన్నారు. తనియాలి ఎస్టీ కాలనీకి చెందిన గిరిజనులకు పట్టాలు ఇవ్వలేదని వాపోయారు.

అధిక రసాయనిక ఎరువుల వినియోగం అనర్థదాయకం

చిల్లకూరు: రైతులు అధికంగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడితే అనేక అనర్థాలు కలుగుతాయని వ్యవసాయశాఖ జిల్లా వనరుల శిక్షణా కేంద్రం కో ఆర్డినేటర్ భాస్కరయ్య తెలిపారు. మండలంలోని ఉడతావారిపాళెంలో బుధవారం పంటల్లో కాంప్లెక్స్ ఎరువులు, పురుమందుల వాడకం, పంట మార్పిడి తదితరాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు అధిక దిగుబడి కోసమని ఇష్టానుసారంగా కాంప్లెక్స్ ఎరువులు, రసాయనిక మందులు వినియోగిస్తున్నారని తెలపారు. దీనివల్ల భూమి సారం కోల్పోతుందన్నారు. వరి పొట్ట దశలో ఉన్న సమయంలో పొటాస్ వాడకం వలన గింజ గట్టి పడడంతో పాటు ధాన్యం దిగబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పులి వజ్రమ్మ, జిల్లా వనరుల కేంద్రం ఏవో వేణుగోపాల్ రావు, చిల్లకూరు ఏవో గూడూరు భవాని తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మా.. కరుణించమ్మా

- వైభవంగా ప్రారంభమైన పోలేరమ్మ జాతర
- పోటెత్తిన భక్త జనం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సైదాపురం: సైదాపురం గ్రామశక్తి పోలేరమ్మ జాతర అత్యంత వైభవంగా ప్రారంభమైంది. పోలేరమ్మ పుట్టినిల్లు అయిన కుమ్మరివీధిలో మంగళవారం అర్ధరాత్రి అమ్మవారి ప్రతిమను తయారు చేసి బుధవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో భక్తుల దర్శనార్థం కొలువుదీర్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకుముందు అమ్మవారిని ఊరేగింపుగా ప్రత్యేకంగా ఏర్పా టు చేసిన గుడి వద్దకు తీసుకువచ్చి నిలుపు కార్యక్రమం చేపట్టారు. ఎస్ఐ క్రాంతికుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అమ్మవారిని రాపూరు సీఐ విజయకృష్ణ దర్శించుకున్నారు.

మడి భిక్షలతో జాతర కళ

జాతర సందర్భంగా పోలేరమ్మకు మడి భిక్షం పెట్టండి.. పోతురాజుకు టెంకాయ కొట్టండి అంటూ భక్తులు సైదాపురంలోని ప్రతి వీధిలోనూ నినాదాలతో హోరెత్తించారు. ప్రతి ఇంటిలోనూ పసుపుతో అమ్మవారి ప్రతిమను తయారు చేసి పూజలు చేసి నైవేద్యంగా అంబలి సమర్పించారు. బుధవారం రాత్రి నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జాతరలో భాగంగా గురువారం ఆరుకులాలకు చెందిన వారు ప్రత్యేకంగా మేళతాళాల నడుమ నైవేద్యం సమర్పించనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ గ్రామాల నుంచి వచ్చే భక్తులకు అమ్మవారిని దర్శించుకునేందుకు అనుమతి ఉంటుంది. సాయంత్రం 5గంటలపైన సైదాపురంలో ఉన్న ఆరు కులాలకు చెందిన వారు మాత్రమే దర్శించుకోవాలి. ఈ తంతు రాత్రి 12 గంటల వరకు ఉంటుంది. అనంతరం అమ్మవారిని సాగనంపే కార్యక్రమాన్ని చేపడతారు.

డక్కిలి ఎంపీడీవోగా గుణశేఖర్‌రెడ్డి



డక్కిలి: ఎంపీడీవోగా టి.గుణశేఖర్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన తిరుపతి తుడా ఏవోగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆయనను పలువురు ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఆదార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రావణి

గూడూరు రూరల్: గూడూరు మున్సిపాలిటీలోని చెన్నూరులో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ మట్టం శ్రావణి సూచించారు. ఆమె బుధవారం ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడు తూ ఇక్కడ ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. కరుణాకరరెడ్డి, హేమకుమార్, అల్లం క్రిష్ణయ్య, బుజ్జ రమణయ్య, అశోక్, క్రిష్ణమూర్తి, శ్రీను పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్: మండలంలోని మేనకూరు సమీపంలో బుధవారం రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పెళ్లకూరుకు చెందిన పాస్టర్ జాన్‌పాల్ బైక్‌లో మేనకూరుకు వెళ్లి తిరిగి వస్తున్నారు. మేనకూరు సెంటర్ వద్ద మలుపులో ఎదురుగా వచ్చిన మరోబైక్ ఢీకొంది. పాస్టర్ జాన్‌పాల్, నాయుడుపేట పొగ్గొట్టం కాలనీకి చెందిన వీర రాఘవులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి నుంచి ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. సీఐ బాబీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీరు బాటిల్‌తో దాడి

నాయుడుపేట మండలంలోని పుదూరుకు చెందిన వెలుగు గురుశేఖర్‌పై బుధవారం రాత్రి అదే గ్రామానికి చెందిన గురవయ్య బీరు బాటిల్‌తో దాడి చేశాడు. గురుశేఖర్ నాయుడుపేటలో టైలర్ షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి దుకాణం మూసి బైక్‌లో స్వగ్రామం వెళ్తున్నాడు. జాతీయ రహదారి కూడలి వద్ద పుదూరుకు చెందిన గురవయ్య అతన్ని అడ్డుకుని బీరు బాటిల్‌తో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన గురుశేఖర్‌ను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

వెంకటగిరి(సైదాపురం): చిన్నారులకు ఆట, పాటలు, విద్య నేర్పించడంతోపాటు వారి ఆరోగ్య పరిరక్షణ కూడా అవసరమని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆయన బుధవారం వెంకటగిరి పట్టణంలోని మల్లమ్మగుడిలో ఉన్న చెవిరెడ్డిపల్లి–2 అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. వంటగది, సరుకులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సంపూర్ణ పోషణ అభియాన్ ద్వారా పౌష్టికాహారం అందజేస్తున్నట్టు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో ముచ్చటించి బోర్డుపై ఏ బీ సీ డీలతోపాటు సంఖ్యలను రాయించారు. తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో కోటేశ్వరరావు, సీడీపీవో శంషాద్‌బేగం, ఎంఈవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

బాలాయపల్లి(సైదాపురం): బాలాయపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసులను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరిన నేపథ్యంలో రికార్డులను సురక్షిత గదిలో భద్రపరచాలన్నారు. కార్యాలయాన్ని మరో భవనంలోకి తాత్కాలికంగా మార్చి సేవలు అందించాలని సూచించారు. అనంతరం హస్తకావేరి గ్రామస్తులతో మాట్లాడారు. డీటీ శిరీష తదితరులు పాల్గొన్నారు.

భూములను పరిశీలన

సైదాపురం: మండలంలో చాగణం రాజుపాళెంలో ఫ్యాక్టరీకి కేటాయింపునకు సంబంధించిన భూమిని బుధవారం జేసీ కె.కార్తీక్, నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్‌తో కలిసి పరిశీలించారు. ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్టు తెలిపారు. తహసీల్దార్ రమాదేవి, డీటీ అనూరాధ, సర్వేయర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిఫ్ ఫ్లీనరీ

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణంలోని బేరిపేటలో ఉన్న సౌత్ ఆంధ్ర లూథరన్ చర్చి ఆవరణలో బుధవారం నాయుడుపేట పాస్టర్స్ ఫెలోషిప్ ప్లీనరీ నిర్వహించారు. ఇందులో సంఘం పెద్దలు వివిధ అంశాలపై చర్చించారు. సంఘం ప్రెసిండెంట్ ఓ మైకేల్ బెన్‌హర్, వైస్ ప్రెసిడెంట్ శరత్‌బాబు, సెక్రటరీ ప్రేమ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ సురేష్ పాల్, ట్రెజరర్ మురళీధర్, సలహాదారులు ఏసుపాదం, జోసెఫ్ రాజు, సూరిబాబు, కార్యవర్గ సభ్యులు శామ్యూల్, ఐజాక్ పాల్గొన్నారు.

అధికారులు అభివృద్ధి పనులపై దృష్టిసారించాలి

రాపూరు: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని ఎంపీడీవో భవాని తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్ ఏఈ వాసు మాట్లాడుతూ మండలంలో 34 సిమెంటు రోడ్లకు రూ.2.20 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. ఎంఈవో శ్రీనివాసులు మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రహరీ గోడల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇరిగేషన్ ఏఈ సర్దార్ మాట్లాడుతూ మండలంలోని 8 నీటి సంఘాలకు వచ్చే నెల 21న ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలిపారు. నవంబర్ 1న ఓటరు జాబితాను ప్రకటిస్తామన్నారు. దానిపై అభ్యంతరాలు ఉంటే తహసీల్దార్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసన్న, జెడ్పీ ఉపాధ్యక్షురాలు ప్రసన్న ,వైస్ ఎంపీపీలు పెంచలరెడ్డి, వెంకటస్వామి, తహసీల్దార్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ పరీక్షలకు విశేష స్పందన

సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేట మండలం పేర్నాడు పీహెచ్‌సీలోని కోటపోలూరు–1 సచివాలయం వద్ద బుధవారం స్విమ్స్, బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు విశేష స్పందన లభించిదని డాక్టర్ ఎస్.రమణయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ 35 ఏళ్లు దాటిన మహిళలు తప్పనిసరిగా రొమ్ము, గర్భాశయ ముఖ ద్వారం క్యాన్సర్ పరీక్షలు చేసుకోవాలన్నారు. పురుషులు నోటి క్యాన్సర్‌కు పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అనంతరం పింక్ బస్సు ద్వారా పరీక్షలు చేశారు. బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ డాక్టర్ పద్మావతి పాల్గొన్నారు.

